క్లుప్తంగా

నేటి నుంచి ఆడికృత్తిక వేడుకలు

రామసముద్రం: రామసముద్రం దిగువపేటలో వెలసిన శ్రీ ప్రసన్నపార్వతి సమేత చంద్రశేఖర్ స్వామి ఆలయంలోని శ్రీసుబ్రమణేశ్వరస్వామి ఆడికృత్తిక వేడుకలు సోమవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు బాలస్వామి తెలిపారు. ఈ నెల 29న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు, పుష్పాలంకరణ, కళ్యాణోత్సవం, 30న ప్రథమ కాలాభిషేకం, రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ఉత్సవాలలో పాల్గొనాలని కోరారు.

వైభవంగా కావిళ్ల పండుగ


తిరుమలరెడ్డిపల్లిలో కావిళ్లతో భక్తులు

రామసముద్రం: మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో కావిళ్ల పండుగ నిర్వహించారు. తిరుమలరెడ్డిపల్లి గ్రామస్తులు ఉపవాస దీక్షతో శ్రీసుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు వస్త్రాలు ధరించి కావిళ్లును పూజించి కేరళ వాయిద్యాల నడుమ హరోం...హోర నామస్మరణతో తమిళనాడులోని తిరుత్తనికి బయలుదేరి వెళ్లారు. కావిళ్ల పండుగలో బంధుమిత్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామదేవతకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పీలేరు : స్థానిక చిత్తూరు రోడ్డు మోడల్‌కాలనీలో వెలసిన గ్రామదేవత ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి భక్తులు వారి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు, అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త దేవిరెడ్డి వెంకట్రమణరెడ్డి ఆధ్వర్యంలో, అర్చకులు శ్రీనివాస్‌దీక్షితులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పూజారి శ్రీనివాసులు కాలనీ నుంచి అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులకు హారతి ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

పంపిణీకి సిద్ధంగా మొక్కజొన్న విత్తనాలు

రామసముద్రం: మండలంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మొక్కజొన్న విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు మదనపల్లె పశుసంవర్ధకశాఖ ఏడీ రోహిణి ఆదివారం తెలిపారు. కమ్మవారిపల్లి, పెద్దకురప్పల్లె, ఆర్.నడింపల్లి, కాప్పల్లె, ఎలవానెల్లూరు, ఊలపాడు, మినికి, మూగవాడి, కుదురుచీమనపల్లె, రామసముద్రం, చెంబకూరు ఆర్‌బీకెలకు ఒకొక్క ఆర్‌బీకేకు వెయ్యి కీలోల చొప్పున వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం 75 సబ్సిడీతో విత్తనాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఐదు కిలోల మొక్కజొన్న విత్తనాలు రూ.85లు, 5 కిలోల పశుగ్రాసం విత్తనాలకు రూ.115 చెల్లించాలన్నారు. త్వరలోనే పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు పోటీ పరీక్షలు దోహదం


వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట టౌన్ : విద్యార్థుల మేధస్సు పెంపునకు పోటీ పరీక్షలు దోహదపడగలవని ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ తెలిపారు. పట్టణంలోని భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో 'ప్రేమ్‌చంద్‌కి జీవని' అనే అంశంపై ఆదివారం వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరుచుకొని చదవాలన్నారు. అయితే ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని సూచించారు. పోటీతత్వం ఉన్నప్పుడే బాగా చదవగలరని, దాని వల్ల అత్యుత్తమ మార్కులు సాధించేందుకు వీలవుతుందన్నారు. పోటీ పరీక్షలు ఎక్కడ నిర్వహించినా విద్యార్థులు పాల్గొనాలన్నారు. అలాగే నిత్యం పాఠశాలకు వెళ్లడం, ఇంటికి వచ్చిన తరువాత చదవడంతో విద్యార్థులు ఒత్తిడికి లోనవుతుంటారని, అయితే పోటీ పరీక్షల కారణంగా ఇతర ప్రాంతాలకు వెళితే మనస్సు ప్రశాంతంగా ఉండి, ఆ ఒక్కరోజైనా ఒత్తిడికి దూరం ఉంటారని చెప్పారు. అలానే పోటీ పరీక్షలతోపాటు క్రీడలకు సంబంధించి వివిధ పోటీల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన తెలియజేశారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన వారికి ఈనెల 31న ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సహాయ కార్యదర్శి శివకుమార్, హిందీ ఉపాధ్యాయుడు బాషా పాల్గొన్నారు.

వైభవం..ఎల్లమ్మతల్లి రథోత్సవం

- భక్తులతో కిటకిటలాడిని ఆలయం
- భక్తిశ్రద్ధలతో దీలు, బోనాలు సమర్పణ


రథంపై పురవీధులలో ఎల్లమ్మ


అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

కలికిరి: కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు ఆదివారం అమ్మవారు నూతన రథం(తేరు)పై విహరించారు. ఉదయం ఆలయం వద్ద నుంచి విశేష పుష్పాలంకరణ చేసిన నూతన రథంపై అమ్మవారు ఆర్‌ఎస్ రోడ్డు, బ్రాహ్మణవీధి, మెయిన్ బజారు, రైల్వే బ్రిడ్జి వరకు చిద్విలాసంగా ఊరేగారు. అమ్మవారిని చూసిన భక్తులు పులకరించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటింటి వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. తేరుపై అమ్మవారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. పురవీధులలో తేరును లాగడానికి భక్తులు పోటీపడ్డారు. తిరిగి ఆలయానికి చేరుకున్న తరువాత సిద్ధపూజ నిర్వహించారు. అమ్మవారికి వరపడిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

దీలు, బోనాలు సమర్పణ:
మధ్యాహ్నం నుంచి కలికిరి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసి అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సంప్రదాయ వాయిద్యాలు, చెక్కభజన, బళ్ళారి డ్రమ్స్ తదితర వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగింపుగా నిర్వహించారు. భక్తుల ఊరేగింపులతో కలికిరి పట్టణంలో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలను కిక్కిరిశాయి. రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు వివిధ ప్రాంతాల నుంచి చాందినీ బండ్లు ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకోనున్నాయి. ఆలయ ప్రదక్షిణలు, అమ్మవారికి బలిదానం సమర్పణతో వర పడిన భక్తుల మొక్కులు తీరుతాయి.

పటిష్ట బందోబస్తు..
కలికిరి సీఐ మోహన్‌తో పాటు సీఐలు మధుసూదన్ రెడ్డి, వల్లిబాషు ఆధ్వర్యంలో నలుగురు ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్‌లు, పీసీలు, హోంగార్డులు మొత్తం 170 మంది సిబ్బంది జాతర బందోబస్తులో పాల్గొన్నారు. కలికిరి గాంధీ కూడలి నుంచి భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించకుండా నిలువరించారు. రైల్వే బ్రిడ్జి ప్రాంతం నుంచి వాహనాల మళ్లింపుతో జాతరలో భక్తులకు ట్రాఫిక్ సమస్య తప్పినట్లైంది.


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ

జాతరలో నేడు...
జాతర ఉత్సవాలలో సోమవారం ఉదయం అమ్మవారి సర్వదర్శనం, రాత్రికి లంకాదహనం కార్యక్రమం అనంతరం అమ్మవారు పుష్పపల్లకీ వాహనంలో పురవీధులలో ఊరేగుతారని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లి జాతర
వాల్మీకిపురం: స్థానిక తిరుపతి రోడ్డులోని ఎల్లమ్మ తల్లి జాతర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని టి.సాకిరేవుపల్లి, బూడిదవేడు తదితర గ్రామాల్లో అమ్మవారికి దీలుబోణాలు సమర్పించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చన, పుష్పాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక తిరుపతి రోడ్డులోని ఎల్లమ్మ తల్లిని రాత్రి పుష్పపల్లకిపై పురవీధుల్లో ఊరేగించి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నదానం



పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీలో పీర్ల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో వివిధ వేషధారణలు చూపరులను ఆకట్టుకొన్నాయి. గ్రామస్థులు, నిర్వాహకులు జలది కార్యక్రమంలో భాగంగా ఆదివారం అన్నదాన సౌకర్యం కల్పించారు.

వధూవరులకు ఆశీర్వాదం


వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి

రామసముద్రం: మండలంలోని మినికి గోకుల్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన రామసముద్రం ఎంపీటీసీ మస్తాన్ కుమార్తె వివాహానికి మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌గౌడ్, కేశవరెడ్డి, కొండూరు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి , చంద్రారెడ్డి, దర్శన్‌గౌడ్, తిప్పరాజు, ఉపసర్పంచ్ మస్తాన్, సుజ్ఞానమూర్తి, కృష్ణప్ప, కొమ్ము నారాయణ స్వామి, నాగరాజ, కోటూరి ఈశ్వర్ పాల్గొన్నారు.

ఏపీ రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనం

- స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరయ్య, కే.వి.వి.ప్రసాద్


మాట్లాడుతున్న ఏపీ రైతుసంఘం నాయకులు

మదనపల్లె : పట్టణంలోని ఎస్‌వీఆర్ కల్యాణ మండపంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కే.వి.వి.ప్రసాద్ కోరారు. స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...రైతుసంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనంలో మొదటిరోజైన సోమవారం వ్యవసాయ రంగం–సవాళ్లు–ప్రభుత్వాల బాధ్యత అనే విషయంపై సెమినార్ నిర్వహిస్తామన్నారు. దీనికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్.కే.నారాయణ, అఖిలభారత కిసాన్‌సభ జాతీయప్రధాన కార్యదర్శి రావులవెంకయ్య, వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డేశోభనాద్రీశ్వరరావు, సీబీఐ విశ్రాంత జేడీ లక్ష్మీనారాయణ, ఇతర రాష్ట్రాల రైతునాయకులు హాజరవుతున్నారని తెలిపారు. మూడురోజుల పాటు మదనపల్లెలో జరిగే రైతు సమ్మేళనంలో రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై చర్చలు జరిపి సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి రాకముందు రైతాంగ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేస్తామని రైతాంగానికి చెప్పిన హామీలను అమలు జరపడం లేదన్నారు. దాదాపు ఏడాది పాటు దేశంలోని 500 రైతుసంఘాలు ఢిల్లీ సరిహద్దుల్లో చేసిన పోరాటం ఫలితంగా మూడు నల్లచట్టాలు రద్దుచేశారన్నారు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ రాజధాని అమరావతికి అప్పుగా కాకుండా గ్రాంటుగా రూ.15వేల కోట్లు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రాయలసీమ జిల్లాల్లో పెండింగ్‌లోని తాగు,సాగునీటి ప్రాజెక్టులను, హంద్రీ–నీవా ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తిచేయాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, జిల్లా కార్యవర్గసభ్యులు తోపుకృష్ణప్ప, సాంబశివ, మురళీ, వంగిమళ్లరంగారెడ్డి, తిరుమల, రెడ్డివెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంఘ సేవకుడికి రొమ్మాల మునికృష్ణారెడ్డి పురస్కారం

- ప్రజాచైతన్య స్రవంతి ఆధ్వర్యంలో రామమూర్తికి సన్మానం
- ప్రతిభా పురస్కారం–2024 ప్రదానం


రామమూర్తికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న ప్రజాచైతన్యస్రవంతి సభ్యులు

మదనపల్లె : పోలీసుశాఖలో నిబద్ధతతో వృత్తి బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రవృత్తి ద్వారా యాంకర్‌గా, మిమిక్రీ ఆర్టిస్టుగా, విద్యార్థులకు, వ్యక్తులకు మోటివేషన్ ద్వారా సామాజిక బాధ్యతలు, క్రమశిక్షణల గురించి వివిధ రకాలుగా వివరిస్తున్న సంఘసేవకుడు డి.జి.రామమూర్తి అని పలువురు కొనియాడారు. భరతముని ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు రొమ్మాల మునికృష్ణారెడ్డి పేరుతో ప్రతిఏటా మదనపల్లె ప్రజాచైతన్య స్రవంతి అందిస్తున్న స్మారక ప్రతిభా పురస్కారం–2024కు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ డి.జి.రామమూర్తిని ఎంపిక చేశారు. పట్టణంలోని ప్రశాంత్‌నగర్ జ్ఞానోదయ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రామమూర్తిని ఘనంగా సన్మానించి పురస్కారం ప్రదానం చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డాక్టర్.గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ....శ్రీ కాళహస్తి, మదనపల్లె, బెంగళూరు, హైదరాబాద్‌లలో భరతముని ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిఏటా ఫిల్మ్‌ఫేర్, ఆదర్శ వనిత, కళారత్న అవార్డులు అందిస్తూ, వెన్నెల వెన్నెల కార్యక్రమాలతో విశిష్టమైన కళా, సాంస్కృతిక సేవలు అందించిన వ్యక్తి రొమ్మాల మునికృష్ణారెడ్డి అని అన్నారు. మదనపల్లెలో వివిధ సాంస్కృతిక సేవలందించిన వ్యక్తిగా స్థానిక ప్రజలకు రొమ్మాల మునికృష్ణారెడ్డి చిరస్మరణీయుడన్నారు. చైతన్యభారతి సంపత్‌కుమార్, జ్ఞానోదయ కరస్పాండెంట్ కామకోటిప్రసాదరావులు రొమ్మాల మునికృష్ణారెడ్డి సాంస్కృతిక ప్రస్థానాన్ని, తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమ నిర్వాహకులు టీఎస్‌ఏ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సామాజికసేవా తత్పరులుగా రామమూర్తి జీవనప్రస్థానం సాగడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత రామమూర్తి మాట్లాడుతూ.. భరతముని ఆర్ట్స్ అకాడమీ మునికృష్ణారెడ్డి ద్వారా జరిపిన కార్యక్రమాలు, పొందిన కళారత్న అవార్డును వివరించారు. పోలీసు వృత్తిపై, సమాజసేవపై తమకున్న ఆశయాలను, ఆదర్శాలను ప్రసంగంలో వివరించారు. కార్యక్రమంలో ప్రజాచైతన్యస్రవంతి కార్యదర్శి ధర్మాధిపతి నాగభూషణరావు, కురలి వెంకటరమణ, శకుంతలమ్మ, వి.ఎం.నాగరాజ్, లైబ్రేరియన్ వసంతకుమారి, జి.రామ్మోహన్ రెడ్డి, పండిత వాసాకృష్ణమూర్తి, రంగనాథాచార్యులు, మునిగోపాలకృష్ణ, ఆర్.జగన్మోహన్ నాయుడు, ఆలూరిసురేష్, హరినాథబాబు, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో ముందుకెళ్దాం


వాల్మీకిపురం: మాట్లాడుతున్న మానవత సంస్థ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి


కలకడ: మానవత సంస్థలో సభ్యత్వం తీసుకుంటున్న సభ్యులు

వాల్మీకిపురం: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకెళ్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి సేవా మందిరంలో నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో పాటు యువతలో సేవాభావం పెంపొందే విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. మానవతా సంస్థలోకి మరింత మంది విశ్రాంత ఉద్యోగులు, యువత రావాలని, తద్వారా సేవా కార్యక్రమాలు విస్తృతం చేయవచ్చునన్నారు. ప్రస్తుతం సంస్థ ద్వారా వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సులు, బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులు, ప్రజలు సేదతీరేందుకు బల్లలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో ముందుకెళ్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో ఈ సేవలను పల్లెలకు విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కేశవ రెడ్డి, ఆనంద శెట్టి, రామక్రిష్ణారెడ్డి, శంకర్, చంద్ర, పివి నారాయణ, సత్యనారాయణ, మురళి, రాజారెడ్డి, లక్ష్మన్న, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సేవే మానవత ధ్యేయం
కలకడ : ఉచిత సేవే మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ధ్యేయంగా ముందుకు సాగడం సభ్యులలో ఆత్మవిశ్వాసాన్ని, మానవసేవే–మాధవసేవ అనే నానుడిని ప్రతి ఒక్క సభ్యుడికి గుర్తు చేస్తుందని మండలశాఖ సంస్థ అధ్యక్షులు పివి నాయుడు అన్నారు. ఆదివారం కలకడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన ఆ సంస్థ నెలవారి సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఫ్రీజర్ బాక్స్‌లు, శాంతిరథం, భవన నిర్మాణం కోసం దాతలు చేసిన సహాయం, వారి సహకారం మరువలేనిదని కొనియాడారు. ఈ ఏడాది మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టి, మరింత మందిచే సభ్యత్వం తీసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ కార్యదర్శి వెంకటేశ్వర, కోశాదికారి ఖాజాఫీర్, సభ్యులు గంగాద్రినాయుడు, వైవి రమణ, సయ్యద్‌సాహెబ్, జివి రమణ, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సేవలో ఎమ్మెల్యే దంపతులు


ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న సర్పంచ్ అలివేలమ్మ తదితరులు

కలకడ : ముత్యాలమ్మ సేవలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆదివారం మండలంలోని రాతిగుంటపల్లె పంచాయతీ గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక అభిషేకాలు, ఏటాబోనం సమర్పించారు. పూజ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే దంపతులకు స్థానిక సర్పంచ్ అలివేలమ్మ స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే దంపతులను పూలమల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ప్రభాకర్‌నాయుడు, నాయకులు ఆనందనాయుడు, వసంత నాయుడు, మల్లికార్జుననాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, మిషన్ పెద్దోడు(రమణ), కమల్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

వైరల్ హెపటైటీస్ నిర్మూలనకు నడుంబిగిద్దాం

రాజంపేట రూరల్ : వైరల్ హెపటైటీస్ నిర్మూలనకు నడుంబిగిద్దామని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానే శేఖర్ వైద్య సిబ్బందికి పిలుపునిచ్చారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న వైఎస్సార్ సర్కిల్ వరకు ఆదివారం డిప్యూటి డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో జాతీయ వైరల్ హెపటైటీస్ నివారణ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైరల్ హెపటైటీస్ బీ, సీ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్‌లు పిల్లి జయప్రకాష్, శివరామ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మానవత సంస్థ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

పీలేరు : మండల మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నూతన అధ్యక్షుడిగా శెట్టి సుబ్రమణ్యం, కార్యదర్శిగా బి.వెంకటసురేష్, కోశాధికారిగా జగన్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ రామచంద్ర తెలిపారు. ఆదివారం పీలేరులో నిర్వహించిన నెలవారి సర్వసభ్య సమావేశంలో 2024–25 సంవత్సరానికి నూతన కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి, డైరెక్టర్స్ బోర్డు సభ్యులుగా 9 మంది, అడ్వైజరి బోర్డు సభ్యులుగా 9 మంది, శాశ్వత సభ్యులుగా 9 మందిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. నూతన కమిటీ ద్వార ఉచిత సేవలును మరింతగా పెంచి, పాఠశాలల్లో మానవత విలువలు పెంచడం, మొక్కలు నాటి వాటిని పోషించడం, సభ్యత్వం పెంచి మానవత సంస్థ మనుగడను కాపాడటానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ


అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగాచూడమ్మా.. అంటూ భక్తులు అమ్మవారికి మొక్కుకొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రదాయినిగా ప్రసిద్ధి గాంచిన అమ్మవారి ఆలయానికి వేకువజామునుంచే భక్తుల రాక మొదలైంది. కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. పలువురు భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. మరికొందరు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

రేపు సుబ్రమణ్య స్వామి కల్యాణం

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకట్టపై వెలసివున్న శ్రీ సుబ్రమణ్యేశ్వరుడి దేవాలయంలో 30వ తేదీ మంగళవారం ఆడికృతిక సందర్భంగా సుబ్రమణ్య స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు పప్పుశెట్టి సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది ఆడికృతిక రోజున స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కల్యాణాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో వస్తారన్నారు. ప్రజలు కల్యాణంలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

గృహ నిర్మాణాలకు ప్రత్యేక అధికారులు

బి.కొత్తకోట: జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసి చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు కలెక్టర్ శ్రీధర్ ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని పేదలకు నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా 78,221 పక్కా గృహాలను మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలను లబ్ధిదారులు చేపట్టారు. అయితే ఇటీవల నిర్మాణాల పురోగతి లేకపోవడంతో కలెక్టర్ సమీక్షించారు. సింగిల్ డిజిట్ పురోగతి కనిపించకపోవడంతో ప్రత్యేకాధికారులను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 30 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు సాగుతున్నాయి. ఒక్కో లేఅవుట్‌కు ఒక మండలస్థాయి అధికారి చొప్పున 60 లేఅవుట్లకు 60 మంది అధికారులను నియమించారు. వీరు వారికి కేటాయించిన లేఅవుట్‌కు ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, ఇతరా శాఖల అధికారుల సమన్వయంతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

విశ్రాంత ఉద్యోగుల డీఏలను మంజూరు చేయాలి


మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగులకు బకాయి ఉన్న డీఏలను మంజూరు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వాయల్పాడు తాలూకా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శంకర కోరారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మాసం ఒకటో తేదీన పింఛన్లు చెల్లించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. వీటితో పాటు విశ్రాంత ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాబోవు రోజుల్లో విశ్రాంత ఉద్యోగుల సంఘానికి సొంత సమావేశ భవనం నిర్మించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు రెడ్డెప్ప, రాజగోపాల్, రామూర్తి నాయుడు, జవాద్ హుస్సేన్, షఫీ, అహ్మద్, వర్మ, నజీర్, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి


ఆరోగ్యసూత్రాలు తెలియజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

పీలేరు : ప్రాణాంతకమైన హెపటైటీస్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం ఉచిత టీకాలను అందిస్తుందని ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తగా రక్తపరీక్షలు చేసుకుని ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ కోరారు. ఆదివారం ప్రపంచ హెపటైటీస్ దినోత్సవం సందర్భంగా పీలేరు టౌన్ కోటపల్లి బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు హెపటైటీస్ వ్యాధి నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. శుభ్రతలేని ఆహారం తీసుకోవడం, కలుషితమైన రక్తం ద్వారా, కలుషిత నీటివలన, ఇతర వ్యాధిగ్రస్తుల ద్వారా మాత్రమే ఇతరులకు వ్యాపిస్తుందని గుర్తు చేశారు. వ్యాధి నియంత్రణలో భాగంగా శిశువులకు ముందస్తు టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ కొండయ్య, హాస్టల్ వార్డన్ మునిస్వామి, ఏఎన్‌యం భార్గవి, సిహెచ్‌ఓ చంద్రకళ, ఆశ వర్కర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా విద్యుత్ స్తంభం


తిప్పరాయ చెరువులో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

పెద్దతిప్పసముద్రం: స్థానిక తిప్పరాయ చెరువులో డ్రిల్లింగ్ చేసిన ప్రభుత్వ తాగునీటి బోరుకు డిస్కం. అధికారులు విద్యుత్ స్తంభాలు అమర్చారు. అయితే సదరు స్తంభాలు ప్రమాదం అంచున ఉన్నాయి. రైతులు, చేపలు పట్టేవాళ్ళు, వ్యవసాయ పనులకు వెళ్లే దినసరి కూలీలు, పశు కాపరులు చెరువులో నిత్యం సంచరిస్తుంటారు. విద్యుత్ స్తంభాలు ఎప్పుడు కూలిపోతాయోనని ప్రజలు భయ భ్రాంతులకు లోనవుతున్నారు. ప్రమాదాలు జరకగనే ముందస్తుగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.